కథానిక

# అలలూ, కలలూ

అవసరాల రామకృష్ణారావు

ఎనిమిదేళ్ళ వయస్సప్పుడు కామేశ్వరి ఓ నాడు పొద్దుటే లేచి వాళ్ళమ్మతో అందిట, అమ్మా, అమ్మా, నాకు రాత్రి మంచి కలొచ్చిందే- నాకేమో, పెద్దతోక మొలిచిందిటా... అమ్మ నవ్వింది. ఊరుకోక "ఇప్పుడాలోటు ఏమి కనపడుతోందే?" అంది. మా కామేశ్వరికి చాలా కోపంవచ్చింది. నే రాగానే నాతో అంతాచెప్పి-

"చూశావుటే భానూ? ఈ అమ్మకేం తెలుసూ నా మొహం? ఎంతసేపూ నన్ను కొట్టడం, నాన్నని తిట్టడం తప్పితే? చక్కగా జామచెట్టు చివర కొమ్మ ఎక్కి పరువుకొచ్చిన పండు తింటే ఎంత బాగుంటుందే?"

దాని భావాలు ఎప్పుడూ చెట్టు చివరనే ఉన్నాయి. దానిదృష్టి చిన్నప్పట్నుంచీ అంత పండీ పండని పరువుకాయమీదే ఉంది. నాకు దాంతో స్నేహమయిన దగ్గిర్నుంచీ దాని ఊహాలు మబ్బుల్లోనే విహరిస్తున్నాయి.

* * *

అదింకా స్కూలు ఫైనలు చదువుతూనే ఉంది. మా నాన్నగారికి దగ్గు ఎక్కువైందని తెలిసి నేను మా అత్తారి ఊరు కళింకోటనుంచి, మా ఊరు కాకినాడ వచ్చాను. రెండురోజులు పోయాక కామేశ్వరీవాళ్ళయింటికి వెళ్ళేను. అది యింట్లోలేదు-స్కూలుకు వెళ్ళిందిటా, వాళ్లమ్మ చాపేసి కూర్చోపెట్టింది.

"ఏమమ్మా భానుమతీ ఎలా ఉంది మీ నాన్నగారి వంట్లో?"

"కొంచం తగ్గిందండి — మీ కామేశ్వరిని యింకా చదివిస్తారు కాబోలు!"

"ఏం చదువులు పోనిద్దూ తల్లీ? పదహారేళ్ళు పైబడ్డాయి. దానితరవాత పెళ్ళికావలసిన పిల్లుంది..."

"అవునవును...అన్నట్టు సీతేదీ?"

"అదీ బడికెళ్ళింది ... ఫోర్తుఫారం చదువుతోంది...నిన్నుచూస్తే ఎంతో ముచ్చటేస్తోంది. ఎందుకొచ్చిన చదువులమ్మా? ఆ క్షణానికి ఏది ఫాషనో అది అలంకరించుకోడం, అందర్నీ వెక్కిరించడం-ఇంతకన్న యిదినేర్పేది ఏముందీ? ముగ్గుపెట్టడం అసహ్యించుకునే పిల్లలు - పోనీ పరీక్షల్లో అయినా ఫస్టుమార్కులు తెచ్చుకోవాలా? ఎందుకూ, నే ఎంత మొత్తుకుంటే ఏం లాభం? ఆయనకుండాలి."

"ఏం? మునుపు శ్రద్ధగా చదివేదండీ?-ఇప్పుడేం?"

"అక్కా చెల్లెలూ లైటు వెలిగించుకుని పుస్తకాలు ముందుపడేసుకుని రాత్రుళ్లు కూర్చుంటారు. ఏ సినిమాగురించో వాదించుకుని ఇద్దరూ ఆఖరికి కొట్టుకోడం. బాగుందా? ఐనా వయసొచ్చిన వాళ్లకి చదువెందుకమ్మా? ఇటు ఓ అత్తెసరూ పెట్టడం రాక..."

మాట పూర్తవకుండా కామేశ్వరి లోపలికొచ్చింది. నాకళ్లు జిగేలుమన్నాయి. నే నీమధ్య దాన్ని చూడలేదు. నలుపయినా కళకళలాడుతూ ఎంతో బాగుంది. అయితే వాళ్ళమ్మ చెప్పినట్టు అందంకన్న అలంకరణ ఎక్కువా అనిపించింది. నే లేచి దగ్గిరగా వెళ్లేను.

"నువ్వటే భానూ? ఎవరో అనుకున్నానూ? ఏమే అమ్మా, దానికి ఓ కాఫీ అయినా యివ్వకుండా కూర్చోపెట్టి వాగిస్తున్నావా? రేపు కృష్ణాష్టమి మాకు హాలీడే. ఈ రెండ్రోజులూ యిక్కడ ఉండకపోతే ఊరుకునేదిలేదు. కావాలంటే స్పెషల్ పెర్మిషన్కోసం మా బావగారికి అప్లైచేస్తాను." నాకు ఎంతో ఆనంద మనిపించింది. చక్కటి స్నేహితురాలు కన్న కావలసిందేముంది? హృదయం పంచుకునే స్నేహం కన్న కోరదగిందేముంది?

భోజనాలయ్యాక, డాబామీద కూర్చున్నాక అది నాతో అంది.

"అదేమిటే భానూ, అంతసిల్లీ పని చేశావ్? ఆడపుట్టుక కాపరం చెయ్యడం పిల్లల్ని కనడం-

అంతవరకేనా? 'నేనేం చేశాను?' అని నిన్ను నువ్వు ప్రశ్నించుకుంటే నీకేం జవాబు దొరుకుతుందే?" నేనేం జవాబు చెప్పలేదు, అనుభవం లేని దాని ప్రశ్నలకు నొచ్చుకోనూలేదు. ఊరికే అడిగేను.

"నువ్వేం చేద్దామనీ?"

"ఏదో పెద్ద చదువు చదువుతాగాని-నీలా హఠాత్తుగా డ్రాప్ చెయ్యను" ఇంతట్లో సీత పరుపులు పట్టుకొని మేడమీద కొచ్చింది.

"అక్కయ్య సంగతి-నన్నడుగు భానూ, నే చెబుతాను. నాలుగురోజుల క్రిందట దానికి కల వచ్చిందిట-తను ఎం బి బీయస్ ప్యాసైనట్టూ-బీదరోగులు ఎంతోమందికి ఉచితంగా సేవ చేస్తున్నట్టూ..."

"అలాంటి గొప్ప ఆదర్శాలూ, భావాలూ ఉంటే మంచిదే కదుటే?"

"మంచిదేగాని...దానికి తగిన ప్రయత్నం ఉండాలిగా! అది డాక్టరయితే అంతకన్న కావలసిందేంలేదు. అయితే మొన్న దాన్ని సెలక్షన్ పరీక్షల్లో ప్యాసు చేయించి-పరీక్షకు కట్టించేసరికి తాతలు దిగొచ్చారని నీకు తెలీదు కాబోలు."

"ఛీ! నోర్మూయ్"అంది మా కామేశ్వరి. ఆ కోపంలో- ఆ వెన్నెలలో దాని మొహం చూస్తే నాకు నవ్వాగలేదు. ఇంతట్లో వాళ్ళమ్మ మేడమీదకి త్వరగా వచ్చింది.

"ఒసేయ్ అమ్మాయ్! పెళ్ళివారొచ్చారు, గబుక్కునిరా"అంది హడావిడిగా.

"అయింది అక్కయ్యగారి పెళ్లి!"అంది సీత చప్పట్లుకొడుతూ.

"ఇలా హఠాత్తుగా ఎవరొచ్చారు పిన్నిగారూ?"అన్నాను నేను.

"ఏమో ఓ కబురూ కాకరకాయాలేదు. వీళ్ల నాన్నగారికి ఏనిమిషాని కేంతోస్తే అంతే. మొన్న పెద్దాపురం కేంపుకెళ్ళేరుగా, ఈ అబ్బాయి వచ్చాట్ట- తీసుకు చక్కావచ్చారు. మళ్ళీ 'జనతా'లో వెళ్ళిపోతాట్ట. తొందరగా రండే."

నేనే పెద్దరికం వహించి-దాన్ని గంట బ్రతిమాలి ముస్తాబుచేసి క్రిందకి తీసుకొచ్చాను. అతను యింజనీరింగు చదుతున్నాట్ట. ఓ మోస్తరుగా ఉన్నాడు- ఫరవాలేదు.

"ఏమే భానూ, యిక్కడ సీత లేదుగదా? అది వింటే ఆక్షేపిస్తుంది. నిన్న అతన్ని చూడగానే మనసు మార్చుకున్నాను. మనకెందుకే చదువులూ? ఉద్యోగంచెయ్యాలా, ఊళ్ళేలాలా? అమ్మ మనసు నొప్పించడ మెందుకు?"ఇలా చెప్పుకుపోతోంది కామేశ్వరి. దాని మనస్సు మారినందుకు నాకెంతో సరదావేసింది.

"స్నేహితురాలివిగనక నీతో చెబుతున్నాను-నిన్నరాత్రి నాకో కల వచ్చింది. సన్నాయీ, బ్యేండూ కలసి వినిపిస్తే, ఏమిటో మొట్టమొదట అర్థంకాలేదు..."

"నీ పెళ్లి కాబోలు..."

"ఛా, అదికాదు, వినుమరీ- గృహప్రవేశంట-ఆయన పెద్ద- అతి చక్కని- బంగళా కట్టించారుట- కిటికీలకు రంగురంగుల అద్దాలూ, పాలరాతి గచ్చూ, మంచి బాత్ రూమూ, కిచెనూ... ఎంత బాగుందనుకున్నావ్?"

బీరవా చాటునుంచి సీత యివతలికొచ్చింది. దాన్ని చూడగానే కామేశ్వరి గతుక్కుమంది.

"ఇలాంటి కలే ఎందుకొచ్చిందో నీకు అర్థమయిందిటే భానూ? అతను యింజనీరనీ- యిల్లుకట్టిస్తాడనీ...అయితే ఒక్కదానికే విచారం ఎందుకులే- నే అంటే అక్కయ్య ఏడవడానికిగాని!" అంది సీత నవ్వుతూ. మళ్లీ అదే ఎవరూ అడక్కుండానే చెప్పింది.

"తొందరపడి తీసుకొచ్చారుగాని నాన్నకా సంబంధం నచ్చలేదుట. అతనికి తల్లీ తండ్రీ లేరుట, ఆస్తీలేదుటా. ఇంతా చేస్తే అతను యింజనీరింగు మొదటేడు చదువుతున్నాట్ట. అతను యిల్లుకట్టడ మెప్పుడు, అందులో కామేశ్వరి అక్కయ్య గృహప్రవేశం చెయ్యడ మెప్పుడు?"

"ఛీ, నోర్మూయ్! ఈ కంటికి ఈ రెప్పలు దూరమా? నీకెలాంటి కొంపసరుకు జతపడుతుందో నేచూడకపోతానా?"అంది మా కామేశ్వరి.

*　　*　　*

"నా ఉత్తరం మిమ్మల్ని ఎవరు చదవమన్నారు? అన్నాను నేను పేరంటంనుంచి యింటికొస్తూ. కామేశ్వరి దస్తూరీ కవరుమీద కనపడుతోంది. ఆయన నాకందకుండా దాన్ని ఎత్తి నాలుగుముక్కలు చదివేరు.

"పరీక్ష ప్యాసవడానికి నేనేం చదివేననీ? ప్యాసవుతానని నేనెప్పుడూ అనుకోలేదు. నిన్నే మా రిజల్ట్సు వచ్చాయి. నా పరీక్ష పోయింది." అది విచారించకపోయినా నే విచారించాను. పట్టుచీరతో అలా కుర్చీలో కూలబడిపోయాడు.

"తాసిల్దారుగారమ్మాయికి గొప్ప సంబంధాలే వస్తున్నాయే!" నే ఎగిరి ఉత్తరం లాక్కున్నాను. గబగబా చదివేను. పాపం అది నాకు ప్రతీసంగతీ రాస్తుంది. మళ్ళీ ఏదో సంబంధం వచ్చిందిట. అతనికి డుడుమా వాటర్ ఫాల్స్ దగ్గిర ఎలక్ట్రీషియన్ పనిట.

"పాపం, యీ సంబంధమేనా కుదురుతే బాగుణ్ణండీ" అన్నాను నేను. ఆయన నవ్వుతూ అన్నారు-

"కుదురుతేనేం, కుదరకపోతేనేం- మీ కామేశ్వరి కలలకేం లోటూ? చక్కని జలపాతాలూ, ఆకుపచ్చని మెరుపులు మెరిసినట్టు రామచిలకలూ, జలపాతం ప్రక్క కొండచరియలలో మీ కామేశ్వరి- మొగుడుతో షికారు చేస్తున్నట్టు యీపాటికి కలలు రావంటావా?" నాకు నవ్వురాలేదు, కష్టమనిపించింది.

"చిన్నతనం కన్నెమనసూ, అలలలాంటి ఆలోచనలూ పెళ్ళికాని ఏ పిల్లకి రొత్తా? ఆఖరికి మీకూ అది లోకువయిపోయిందన్న మాట. దాని సంగతి మొదట్నించీ మీతో చెప్పడమే తప్పు" అన్నాను.

*　　*　　*

ఏడాది గడిచింది కాని మా కామేశ్వరినుండి శుభలేఖ రాలేదు. ఆనాటికి యీనాడు మళ్ళీ దీపావళికి మేము కాకినాడ వచ్చాము. వెళ్ళిన వెంటనే నేను కామేశ్వరీ వాళ్ళ యింటికి వెళ్లేను. వాళ్ళమ్మ అంది నేను దాని విషయం అడగ్గా.

"దేనికయినా అన్నీ కలిసి రావాలిగదా, భానుమతీ? సంబంధాలు వస్తున్నాయి వెడుతున్నాయి. వాళ్ళ నాన్నగారికీ దానంత కుర్రతనమే. చిన్న విషయంలో పట్టుదల చేత రెండు సంబంధాలు పుసిగించేశారు!" సీత జడ అల్లుకుంటూ అక్కడికొచ్చింది.

"పోనిద్దూ అమ్మా, ఆయనమీదెందుకు పెడతావ్ - వినవే భానూ! మొన్న ఓ సంబంధం వచ్చింది-అతనికి విమానాలు నడపడం పని-ఎనిమిదొందలు జీతం-తెల్లగా ఎంతో బాగున్నాడు. ఆ రెండురోజుల భాగోతానికి అక్కయ్య-విమానమెక్కినట్టూ, దేశాలన్నీ చూసినట్టూ కలలుకంది అనుకో-దానికేం?..." వాళ్ళమ్మ అడ్డేసింది.

"అవును-నామాట వినవమ్మా, కుర్రాళ్లు వాళ్లకేం తెలుసూ? అతనికి పదివేలు కావాలిట. ఇస్తామే అనుకో-రోజుకో విమానం ఏక్సిడెంటు పేపర్లో పడుతోంది-చూసిచూసి ఎలా ఇవ్వమూ?"

*　　*　　*

తరతరాలుగా సముద్రంలో ఉన్న కెరటాలు తాత్కాలికంగా లేచినా మళ్ళీ యథాస్థానానికి వచ్చేస్తుంటాయి. భారతదేశంలో పుట్టి పెరిగిన కామేశ్వరి గంపెడు కలలుకన్నా దాని పర్యవసానం, గమ్యస్థానం ఒకటే. దానికిప్పుడు యిద్దరు పిల్లలు. దాని మొగుడు బియ్యే ప్యాసయినా ప్రస్తుతం వాళ్ళ స్వస్థలంలో పొలం చూసుకుంటున్నాడు. అయితే మా కామేశ్వరివలె తృప్తిగా జీవించడమే భారతస్త్రీలోని విశేషం!

---

సిటీబస్సులో వయస్సుమళ్ళిన నవనాగరిక స్త్రీ పక్కనే ఏడేళ్ళకుర్రాడొకడు కూర్చున్నాడు. ఉన్నట్టుండి ఆకస్మాత్తుగా తుమ్ము డానికి లంకించుకున్నాడు. వాటికొక ఆదీ అంతూ లేకపోవడంచూసి నవనాగరికస్త్రీ భరించలేక—"అబ్బాయ్! నీదగ్గిర చేతిరుమాలుందా?" అంది.

"చేతిరుమాలాండి! ఉంది" అన్నాడు కుర్రాడు.

"అయితే కాస్త బయటికి తియ్యవేమరి!" అన్నదామె.

కుర్రాడు ఆశ్చర్యపోయినట్లు మొహంపెట్టి, "అమ్మో! మీకు చేతిరుమాలు ఎరువిస్తే ఇంకేమైనా ఉందా! మా అమ్మ వీపు చీరేస్తుంది!" అన్నాడు